
డ్రైనేజీ పైపులైన్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ గౌస్ ఉద్దీన్

రాజాడీలక్స్ చౌరస్తా వద్ద

మురుగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

ముషీరాబాద్, సెప్టెంబర్ 26 (ఆంధ్రజ్యోతి): రాజాడీలక్స్ చౌరస్తాలో రోడ్డుపై మురుగు, వర్షం నీరు అనే శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో గురువారం ప్రచురితమైన కథనానికి జలమండలి అధికారులు స్పందించారు. సమస్య పరిష్కారానికి రాజాడీలక్స్ చౌరస్తాలో డ్రైనేజీ పైపులైన్ నిర్మాణ పనులను చేపట్టారు. పనులను భోలక్‌పూర్ కార్పొరేటర్ గౌస్ ఉద్దీన్, జలమండలి డీజీఎం మోహన్‌రాజ్ పరిశీలించారు.


సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సుప్రియా నవీన్‌గౌడ్

జాంభవినగర్‌లో రూ. 4.50 లక్షలతో సీసీ రోడ్డు

ముషీరాబాద్, సెప్టెంబర్ 26 (ఆంధ్రజ్యోతి): మోహన్‌నగర్‌లోని జాంభవి నగర్‌లో రూ. 4.50 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణపనులను కార్పొరేటర్ సుప్రియా నవీన్‌గౌడ్ గురువారం ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ముషీరాబాద్ డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేవైఎం నగర కార్యదర్శి అనిల్ కుమార్, నాయకులు రవీంద్, చారి, వెంకటేష్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

కొండా లక్ష్మణ్ బాపూజీకి భారతరత్న ప్రకటించాలి

చిక్కడపల్లి, సెప్టెంబర్ 26 (ఆంధ్రజ్యోతి): కొండా లక్ష్మణ్ బాపూజీకి భారతరత్న ప్రకటించాలని చేనేత వర్గాల చైతన్య వేదిక జాతీయ అధ్యక్షుడు డా. చిక్కా దేవదాసు కోరారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ కోసం 95 ఏళ్ల వయస్సులో ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద దీక్ష చేశారని గుర్తు చేశారు. బాపూజీ జీవిత చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాని, ఏదైనా ఒక జిల్లాకు ఆయన పేరు పెట్టాలన్నారు.

నేటి నుంచి వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సభ్యత్వ నమోదు

రాంనగర్, సెప్టెంబర్ 26 (ఆంధ్రజ్యోతి): నగరంలోని బాగ్‌లింగంపల్లి సుందరయ్యపార్కులో గల వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ నూతన సభ్యత్వ నమోదు కార్యక్రమం ఈ నెల 27 నుంచి అక్టోబర్ 30వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.వివేక్, వెంకటస్వామిగౌడ్ తెలిపారు. క్లబ్‌లో సభ్యత్వం తీసుకోవాలని ఆసక్తి గల వారు సుందరయ్యపార్కులో ప్రతిరోజూ ఉదయం 7 నుంచి 10 గంటల వరకు కమిటీ సభ్యులను సంప్రదించవచ్చన్నారు. వివరాలకు 8639841528 నంబర్‌కు ఫోన్ చేయవచ్చన్నారు.

కేంద్రప్రభుత్వ ఉద్యోగం పొందాలంటే హిందీ తప్పనిసరి

చిక్కడపల్లి, సెప్టెంబర్ 26 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ ఉద్యోగం పొందాలంటే హిందీ తప్పనిసరి అని ఉస్మానియా యూనివర్సిటీ తులసి భవన్ డైరెక్టర్ ఆచార్య ప్రదీప్‌కుమార్ అన్నారు. ఏవీవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల హిందీ విభాగం ఆధ్వర్యంలో చిక్కడపల్లిలో ఓ హోటల్‌లో గురువారం హిందీ దినోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన హిందీ భాష ప్రాముఖ్యతను తెలిపారు. విద్యార్థులు హిందీ నేర్చుకోవాలని సూచించారు. హిందీ లెక్చరర్ డా. టీకే వందన, డా. భవానీ తదితరులు పాల్గొన్నారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు.


మహాకాళి ఆలయ కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

మహాకాళి ఆలయ కానుకల లెక్కింపు

ముషీరాబాద్, సెప్టెంబర్ 26 (ఆంధ్రజ్యోతి): మహాకాళి ఆలయంలో కానుకలను భద్రపరిచిన అల్మారాను గురువారం తెరిచారు. నాలుగు సంవత్సరాల క్రితం ముషీరాబాద్ మహాకాళి ఆలయ ఈవోగా పనిచేసిన రాంరెడ్డి గుండెపోటుతో మృతి చెందడంతో అప్పటి నుంచి అమ్మవారి కానుకలకు సంబంధించిన అల్మారాను తెరవకపోవడంతో ఆలయ కమిటీ దేవాదాయ శాఖకు లేఖరాసింది. అల్మారాను తెరిచేందుకు ఉన్నతాధికారులు అనుమతి ఇవ్వడంతో దేవాదాయ శాఖ ఈవోలు జ్యోతి, మహేందర్ పర్యవేక్షణలో తెరిచి కానుకలను లెక్కించారు. అందులో వెండి, బంగారం, పట్టు వస్త్రాలు ఉన్నాయని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ఎయిర్‌టెల్ రాజు, ప్రధాన అర్చకుడు చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.


అల్పాహారం పంపిణీ చేస్తున్న కందూరి కృష్ణ ఫౌండేషన్ సభ్యులు

అల్పాహారం పంపిణీ

రాంనగర్, సెప్టెంబర్ 26 (ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లిలోని వేంకటేశ్వర స్వామి ఆలయ వీధిలో కందూరి కృష్ణ ఫౌండేషన్, సేఠ్ మాణిక్‌లాల్ ఫౌండేషన్ల సంయుక్తాధ్వర్యంలో పేదలకు అల్పాహారం పంపిణీ కార్యక్రమం గురువారం నిర్వహించారు. కందూరి కృష్ణ ఫౌండేషన్ చైర్మన్ కె. కృష్ణ మాట్లాడుతూ.. సామాజిక సేవలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ప్రమోద్ అగర్వాల్, కౌశిక్, గోవిందరావు, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

యశోద ఆస్పత్రి ఏజీఎం ఇంట్లో నగలు చోరీ

బంజారాహిల్స్, సెప్టెంబర్ 26 (ఆంధ్రజ్యోతి): కప్‌బోర్డులో పెట్టిన బంగారు ఆభరణాలు చోరీ అయ్యాయి. బంజారాహిల్స్ రోడ్డు నంబర్-14 నందినగర్‌లో ఓ అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్న మాజిద్ హబీబ్ ఖాన్ యశోద ఆస్పత్రిలో ఏజీఎంగా పనిచేస్తున్నారు. భార్యాభర్తలు ప్రతీరోజూ విధులకు వెళ్తూ తాళంచెవిని ఫ్లాట్ పై భాగంలో పెడతారు. ఈ నెల 23న విధులకు వెళ్లారు. తిరిగి ఇంటికి వచ్చేసరికి తలుపులు తెరిచి ఉన్నాయి. లోపలికి వెళ్లి కప్‌బోర్డులో చూడగా.. అందులో భద్రపరిచిన మూడు జతల బంగారు చెవి కమ్మలు, బంగారు ఉంగరంతో పాటు వెండి గిన్నె కనిపించలేదు. బాధితుల ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దేవాలయాలకు అనుబంధంగా

గోశాలలు ఏర్పాటు చేయండి

బర్కత్‌పుర, సెప్టెంబర్ 26 (ఆంధ్రజ్యోతి): దేవాలయాలకు అనుబంధంగా గోశాలలు ఏర్పాటు చేయాలని తెలంగాణ గోశాల ఫెడరేషన్ గౌరవ అధ్యక్షుడు మహేష్ అగర్వాల్ డిమాండ్ చేశారు. గురువారం కాచిగూడలోని గోశాల ఫెడరేషన్ కార్యాలయంలో షిరిడీ సాయిబాబా సేవా సమాజ్ నిర్వహిస్తున్న గోశాలలకు లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సమర్పణ్ ఆధ్వర్యంలో గోవులకు పశుగ్రాసం అందజేశారు.


గోవులకు పశుగ్రాసం అందజేస్తున్న మహేష్ అగర్వాల్

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వచ్ఛమైన ఆవు పాలు, పెరుగు, నెయ్యి, వెన్నతో పాటు పాల పదార్థాలతో చేసే నైవేద్యాలను దేవుళ్లకు పెట్టాలంటే దేవాలయాలలో గోశాలలను నిర్వహిస్తే అది సాధ్యమవుతుందన్నారు. ప్రతి దేవాలయంలో నైవేద్యానికి ఉపయోగించే వస్తువులను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాల్సిన అవసరం ఉందన్నారు. తిరుపతి లడ్డూ కల్తీ చేయడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సమర్పణ్ ప్రతినిధులు ప్రేమ్‌చంద్ మునోత్, మంజుల, విక్రమ్, గోశాల ప్రతినిధులు రాంకోటేశ్వరరావు, చౌకిరాజు, కోటిరాజు, హసిస్‌సోని, ద్వారక తదితరులు పాల్గొన్నారు.

ఖోఖో పోటీల విజేత సెయింట్ అగస్టీన్ హైస్కూల్

బర్కత్‌పుర, సెప్టెంబర్ 26 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో జరుగుతున్న 68వ హెచ్‌డీఎస్‌జీఎఫ్ ఇంటర్ హిమాయత్‌నగర్ జోనల్ లెవెల్ స్కూల్ కబడ్డీ, ఖోఖో టోర్నమెంట్ పోటీలు రెండవ రోజు గురువారం హోరాహోరీగా జరిగాయి. అండర్ 14 బాలికల విభాగంలో సెయింట్ అగస్టీన్ హైస్కూల్ ఖోఖో విజేతగా నిలిచింది. రెండవ స్థానంలో క్రిస్ట్ చర్చ్ హైస్కూల్, తృతీయ స్థానంలో కేంబ్రిడ్జ్ హైస్కూల్ విద్యార్థులు నిలిచారు. అండర్ 17 బాలికల కబడ్డీ విభాగంలో న్యూచైతన్య హైస్కూల్ విజేతగా నిలవగా, ద్వితీయ స్థానంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆజంపురా-1, తృతీయ స్థానంలో ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల హైదర్‌గూడ విద్యార్థులు నిలిచారు. హిమాయత్‌నగర్ ఎడ్యుకేషన్ జోన్ డిప్యూటీ డీఈవో ఎం. విజయలక్ష్మి, కాచిగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి విజేతలను అభినందించారు. పీఈటీలు పరిమళ, లక్ష్మణ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.


కబడ్డీ ఆడుతున్న విద్యార్థినులు


క్రీడా పోటీలను ప్రారంభించిన సునీల్‌కుమార్

ముషీరాబాద్ జోన్ ఇంటర్ స్కూల్

క్రీడా పోటీలు ప్రారంభం

ముషీరాబాద్, సెప్టెంబర్ 26 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ జోన్ ఇంటర్ స్కూల్ ఖోఖో, కబడ్డీ పోటీలు గురువారం ప్రారంభమయ్యాయి. పోటీలను ఉస్మానియా యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ కాలేజీ ప్రిన్సిపాల్ సునీల్‌కుమార్ ప్రారంభించారు.

ఈ సందర్భంగా ముషీరాబాద్ ప్రభుత్వ విద్యామండలి కార్యదర్శి శ్రీలత మాట్లాడుతూ.. శనివారం ఖోఖో, కబడ్డీ ఫైనల్ పోటీలు జరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో ముషీరాబాద్ విద్యామండలి డిప్యూటీ ఈవోలు చిరంజీవి, జయలక్ష్మి, భారతి, డిప్యూటీ ఐవోఎస్ బాలరాజు, టోర్నమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి శ్రీదేవి, జ్యోతిశ్రీ, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయం చూపించిన తర్వాతే

పరిశ్రమలను, షాపులను తొలగించండి

అంబర్‌పేట, సెప్టెంబర్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రత్యామ్నాయం చూపించిన తర్వాతనే ఇళ్లు, షాపులు, పరిశ్రమలను తొలగించాలని అంబర్‌పేటలో స్మాల్‌స్కేల్ పరిశ్రమల యజమానులు గురువారం అలీకేఫ్ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పట్టా భూములు కొనుక్కొని షెడ్‌లు, పరిశ్రమలు ఏర్పాటు చేసుకున్నామన్నారు. ఇక్కడ దాదాపు 200 పరిశ్రమలు ఉన్నాయని, వాటి ద్వారా సుమారు ఐదువేలమంది ఉపాధి పొందుతున్నారని తెలిపారు. హైకోర్టులో స్టేటస్‌కో ఉన్నప్పటికీ పరిశ్రమల గోడలకు మార్కింగ్ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ధర్నాకు సీపీఎం నాయకుడు మహేందర్, బీఆర్ఎస్ నాయకుడు లింగారావు మద్దతు తెలిపారు.

పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శిగా గణేష్



రాంనగర్, సెప్టెంబర్ 26 (ఆంధ్రజ్యోతి): పీడీఎస్‌యూ హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా కందుకూరి గణేష్ నియమితులయ్యారు. ఆయన నియామకాన్ని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాంబ గురువారం ప్రకటించారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ.. విద్యార్థుల సమస్యలపై పోరాటం చేస్తామని, నగరంలో పీడీఎస్‌యూ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

బధిరుల విద్యాభివృద్ధికి ప్రత్యేక స్కూల్స్ ఏర్పాటు చేయాలి

రాంనగర్, సెప్టెంబర్ 26 (ఆంధ్రజ్యోతి): బధిరుల భాషను గుర్తించి, వారి విద్యాభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక స్కూల్స్‌ను ఏర్పాటు చేయాలని దివ్యాంగుల సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ వల్లభనేని ప్రసాద్ డిమాండ్ చేశారు. దివ్యాంగుల సంక్షేమ సంఘం (డీఎస్‌డీ) ఆధ్వర్యంలో గురువారం బాగ్‌లింగంపల్లిలోని కార్యాలయంలో అంతర్జాతీయ బధిరుల దినోత్సవ నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన కేక్ కట్ చేసి మాట్లాడారు. దేశవ్యాప్తంగా 4 వేల ప్రభుత్వ ఆస్పత్రులు ఉన్నాయని, బధిరులకు వైద్య సేవలు అందించేందుకు వారి భాషను అర్థం చేసుకునే వైద్యులు లేరన్నారు. సమాజంలో వినికిడి లోపం కలిగిన వారు తీవ్ర వివక్షకు గురవుతున్నారని అన్నారు. బధిరుల సంక్షేమానికి ప్రభుత్వాలు ప్రత్యేక నిధులు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వెంకటేష్‌గౌడ్, సత్యనారాయణ, వాసుదేవరావు, సుకన్య తదితరులు పాల్గొన్నారు.



అంతర్జాతీయ బధిరుల దినోత్సవంలో పాల్గొన్న దివ్యాంగుల సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ వల్లభనేని ప్రసాద్ తదితరులు

భాషా ప్రేమికుడు 'చిలకమర్తి'

చిక్కడపల్లి, సెప్టెంబర్ 26 (ఆంధ్రజ్యోతి): సంస్కరణలు, చైతన్యం లక్ష్యంగా గురజాడ, కందుకూరి, కాళ్లకూరి వంటి మహనీయులు సాహిత్యాన్ని అందించారనీ, చిలకమర్తి లక్ష్మీనరసింహం రచనలు నాటి బ్రిటిష్ ప్రభుత్వాన్ని చికాకు పరిచాయని ఐఏఎస్ విశ్రాంత అధికారి డా. కేవీ రమణాచారి అన్నారు. నాటికాలం మహనీయులను స్మరించుకోవడం ప్రేరణ కలిగిస్తుందని అన్నారు. కిన్నెర సంస్థ ఆధ్వర్యంలో గురువారం రాత్రి గానసభలో చిలకమర్తి లక్ష్మీనరసింహం 157వ జయంతి నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రమణాచారి కిన్నెర-చిలకమర్తి స్మారక పురస్కారాన్ని ప్రముఖ సాహితీవేత్త సన్నిధానం నరసింహశర్మకు బహూకరించారు. చిలకమర్తి లక్ష్మీనరసింహం స్వాతంత్ర్యోద్యమంలో పద్యంతో ప్రజలను చైతన్యం చేశారన్నారు. ఆయన భాషా ప్రేమికుడని అన్నారు. సాహితీవేత్త ఓలేటి పార్వతీశం మాట్లాడుతూ.. చిలకమర్తి రాసిన గయోపాఖ్యానం నాటకం పుస్తకం లక్షప్రతులు అమ్ముడుకావడం నేటికీ రికార్డు అని చెప్పారు. కార్యక్రమంలో కిన్నెర రఘు, ప్రముఖ రచయిత్రి డా.భారతి, చిలకమర్తి కుటుంబసభ్యులు తదితరులు పాల్గొన్నారు.


నరసింహశర్మకు పురస్కారాన్ని అందజేస్తున్న రమణాచారి తదితరులు

పాడి రైతుల సమస్యలు పరిష్కరించండి

- రూ. 150 కోట్ల పెండింగ్ బిల్లులను విడుదల చేయాలి
- తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి టి.సాగర్

కవాడిగూడ, సెప్టెంబర్ 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పాడి రైతుల సమస్యలను పరిష్కరించాలని, పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి టి.సాగర్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో పొందుపర్చిన హామీ మేరకు పాడి రైతులకు ఇన్సెంటివ్‌లు అందజేయాలని కోరారు. తెలంగాణ పాడి ఉత్పత్తిదారుల సంఘం, 'విజయ' పరిరక్షణ సమితి సంయుక్తాధ్వర్యంలో గురువారం ఇందిరాపార్కు వద్ద ధర్నా నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా పాడి రైతులు అధిక సంఖ్యలో ఈ ధర్నాకు హాజరయ్యారు. ఈ సందర్భంగా సాగర్ మాట్లాడుతూ.. ఐదు నెలలుగా పాల బిల్లులు చెల్లించకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. లీటరుకు రూ. 5 ప్రోత్సాహకాన్ని వెంటనే అమలు చేయాలని కోరారు. పాడి సంరక్షణకు మందులు, గడ్డి, విత్తనాలను 50 శాతం సబ్సిడీపై ఇవ్వాలని డిమాండ్ చేశారు. మొబైల్ వ్యాన్‌ల ద్వారా పశు వైద్య సేవలు అందించాలన్నారు. టీజీ విజయ పరిరక్షణ సమితి రాష్ట్ర కన్వీనర్ సాదం రమేష్, పాల ఉత్పత్తిదారుల సంఘం రాష్ట్ర కన్వీనర్ మంగ నర్సింహ, రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టి. సాగర్

మూసీ పరివాహక ప్రాంత ప్రజల ఆందోళన

- ఇళ్లు కూల్చివేస్తారన్న వార్తలతో..

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 26 (ఆంధ్రజ్యోతి): మూసీ సుందరీకరణ పేరుతో పరివాహక ప్రాంతాలలో నిర్మించుకున్న ఇళ్లను కూల్చివేయడానికి ప్రభుత్వం సన్నద్ధమవుతుందన్న వార్తలు వస్తుండడంతో గోల్నాక డివిజన్‌లో మూసీ పరివాహక ప్రాంతంలో నివసిస్తున్న ప్రజలు ఆందోళన చెందుతున్నారు. చాదర్‌ఘాట్ బ్రిడ్జి నుంచి అలీకేఫ్ చౌరస్తా వరకు ఉన్న కృష్ణానగర్, తులసీరాంనగర్(లంక), కమలానగర్, న్యూకమలానగర్, అన్నపూర్ణనగర్, దుర్గానగర్, అంబేడ్కర్ నగర్ తదితర బస్తీల్లో ఇళ్లను కూల్చివేస్తారన్న ఆందోళన నెలకొంది. రెండు మూడు నెలల క్రితం అధికారులు మార్కింగ్ చేశారు. శని, ఆదివారాలలో సర్వే చేయడానికి అధికారులు వస్తున్నారన్న సమాచారంతో ప్రజల్లో ఆందోళన మరింత పెరిగింది. 30 ఏళ్ల నుంచి నివసిస్తున్న మా ఇళ్లను కూల్చివేస్తే ఎక్కడికి వెళ్లాలంటే మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వానికి పన్నులు కడుతున్నామని, ఇళ్లు ఎలా కూలుస్తారంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు.



కమలానగర్‌లో విద్యుత్ స్తంభానికి చేసిన మార్కింగ్


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జావేద్

రైళ్లలో చోరీలు చేస్తున్న నలుగురు వ్యక్తుల అరెస్ట్

- ఆరు తులాల బంగారు నగలు స్వాధీనం

బర్కత్‌పుర, సెప్టెంబర్ 26 (ఆంధ్రజ్యోతి): రైళ్లలో చోరీలు చేస్తున్న నలుగురు నిందితులను కాచిగూడ రైల్వే పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి ఆరు తులాల బంగారు నగలు స్వాధీనం చేసుకున్నారు. గురువారం రైల్వే డీఎస్పీ ఎస్.ఎన్.జావేద్, కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప వివరాలను వెల్లడించారు. కర్ణాటక రాష్ట్రం, హసన్ జిల్లా, బేలూరు గ్రామానికి చెందిన సిద్దేశ్ ఈ నెల 18న నగరంలో ఉంటున్న కుమారుడి వద్దకు వచ్చాడు. ఆయన తిరిగి స్వగ్రామం వెళ్తుండగా మైసూరు ఎక్స్‌ప్రెస్ రైలు జనరల్ బోగీలో నలుగురు వ్యక్తులు మత్తు బిస్కెట్‌లు ఇచ్చారు. సిద్దేశ్ మత్తులోకి జారుకున్న తర్వాత ఏడు తులాల బంగారు ఆభరణాలు, రూ. 50 వేలు కాజేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు ప్రారంభించారు. సీసీ ఫుటేజీల ఆధారంగా నగరంలో ఉంటున్న ఉత్తర ప్రదేశ్‌కు చెందిన సురేంద్ర నాగోల్, మహ్మద్ చౌదరి (30), క్రిష్‌కుమార్(22), దిలీప్‌వర్మను అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా నేరాన్ని అంగీకరించారు. నలుగురూ ముఠాగా ఏర్పడి రైళ్లలో దొంగతనాలకు పాల్పడుతున్నారని డీఎస్పీ తెలిపారు. నిందితుల నుంచి ఆరు తులాల బంగారు నగలు స్వాధీనం చేసుకున్నారు. నలుగురినీ రైల్వే కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్ విధించారని డీఎస్పీ, సీఐ చెప్పారు.


చాకలి ఐలమ్మకు నివాళులర్పిస్తున్న మెరుగు శ్రీనివాస్ యాదవ్ తదితరులు

చాకలి ఐలమ్మకు నివాళి

చిక్కడపల్లి, సెప్టెంబర్ 26 (ఆంధ్రజ్యోతి): చాకలి ఐలమ్మ జయంతిని టీజేఎస్ బీసీ సెల్ అధ్యక్షుడు గడ్డం శంకర్ ఆధ్వర్యంలో అరుంధతినగర్ బస్తీలో గురువారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా టీజేఎస్ ముషీరాబాద్ నియోజకవర్గం కన్వీనర్ మెరుగు శ్రీనివాస్ పాల్గొన్ని ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో విజయ్, నవీన్, నర్సింహ, నందు, సత్యనారాయణ, డేనియల్ తదితరులు పాల్గొన్నారు.

నర్సమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదానం

ముషీరాబాద్, సెప్టెంబర్ 26 (ఆంధ్రజ్యోతి): నర్సమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం ముషీరాబాద్ చౌరస్తాలో చైర్మన్ త్రినాథరావు శర్మ అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. ట్రస్ట్ ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు నోట్ పుస్తకాలు, ఆపదలో ఉన్న వారికి నిత్యావసర కిట్లు, ఆస్పత్రుల వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు.


అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న త్రినాథరావు శర్మ

ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి

త్వరలో 'చలో హైదరాబాద్' : టీజేఎంయూ

రాంనగర్, సెప్టెంబర్ 26 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి త్వరలో చలో హైదరాబాద్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్ (టీజేఎంయూ) రాష్ట్ర కమిటీ నాయకులు తెలిపారు. గురువారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో టీజేఎంయూ ఆధ్వర్యంలో ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసేందుకు స్పష్టమైన తేదీని ప్రకటించాలని కోరుతూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మజ్దూర్ యూనియన్ రాష్ట్ర వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి కె. హనుమంతు ముదిరాజ్ మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. సంస్థలో గుర్తింపు కార్మిక సంఘాలను అనుమతిస్తామని ప్రకటించి ఇప్పటికీ అమలు చేయలేదన్నారు. ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా గుర్తించాలన్నారు. డీఏలు, ఇతర బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. తమ డిమాండ్ల సాధనకు త్వరలో పోరాటాలు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు డీవీకే రావు, ప్రేమ్‌రాజ్, గోలి రవీందర్, పీకే మూర్తి, ఆర్.ఎస్.రావు, వెంకటేశ్వర్లు, స్వాములయ్య, కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

సుదర్శన్ థియేటర్‌లో ఎన్టీఆర్ అభిమానుల సందడి

చిక్కడపల్లి, సెప్టెంబర్ 26 (ఆంధ్రజ్యోతి): జూనియర్ ఎన్టీఆర్ నటించిన దేవర సినిమా విడుదల సందర్భంగా ఆర్టీసీక్రాస్‌రోడ్‌లోని సుదర్శన్ థియేటర్‌లో గురువారం రాత్రి హీరో అభిమానులు హంగామా చేశారు. గురువారం అర్ధరాత్రి, శుక్రవారం తెల్లవారు ఝామున నాలుగు గంటలకు సినిమా ప్రదర్శన ఉండడంతో గురువారం రాత్రి 9 గంటల నుంచి అభిమానులు వందలాదిగా థియేటర్‌లో గుమిగూడారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా రంగురంగుల బల్బులు ఏర్పాటు చేశారు. ఎన్టీఆర్ భారీ కటౌట్ ఏర్పాటు చేసి పూలమాలలు వేశారు. సినిమాలోని పాటలను ప్రదర్శిస్తూ కేరింతలు కొట్టారు. రెండు షోల టికెట్లు రూ. 2 వేలకు బ్లాక్‌లో అమ్మినట్లు పలువురు తెలిపారు.



లోగోను ఆవిష్కరిస్తున్న అతిథులు

తెలంగాణ బ్లైండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఏర్పాటు

రవీంద్రభారతి, సెప్టెంబర్ 26 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ బ్లైండ్ స్పోర్ట్స్ అసోసియేషన్‌ను ఏర్పాటు చేశారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో రవీంద్రభారతి కాన్ఫరెన్స్‌హాల్‌లో గురువారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో సంస్థ లోగోను ఆవిష్కరించారు. ముఖ్యఅతిథిగా సరస్వతీ ఉపాసకులు దైవజ్ఞశర్మ, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ప్రభుల్లారెడ్డి, తెలంగాణ బ్లైండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలన చేసి సంస్థ లోగోను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. బ్లైండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమన్నారు. అంధులైనప్పటికీ అన్నిరంగాల్లో రాణించడం గొప్ప విషయమన్నారు. ఫుట్‌బాల్, జూడో, బేస్‌బాల్, కబడ్డీ తదితర క్రీడా పోటీల్లో రాణిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ప్రముఖ కవి డా.చిక్కు హరీష్‌కుమార్, నవీన్, పవన్, కల్యాణ్ పాల్గొన్నారు.

సూపర్ మార్కెట్‌లో నిషేధిత సిగరెట్ల విక్రయం

- నిర్వాహకుడి అరెస్ట్

బంజారాహిల్స్, సెప్టెంబర్ 26 (ఆంధ్రజ్యోతి): నిషేధిత సిగరెట్లను విక్రయిస్తున్న ఓ సూపర్ మార్కెట్ నిర్వాహకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. కృష్ణానగర్‌లో సూపర్ మార్కెట్‌లో నిషేధిత సిగరెట్లు విక్రయిస్తున్నారని ఫిర్యాదు రావడంతో జూబ్లీహిల్స్ ఎస్ఐ సోమశేఖర్ సిబ్బందితో తనిఖీ చేశారు. రూ. 24,210 విలువగల సిగరెట్లను స్వాధీనం చేసుకొని సూపర్ మార్కెట్ నిర్వాహకుడు యశ్వంత్ ఉపాధ్యాయను అదుపులోకి తీసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.